నిడదవోలు డిప్యూటీ ఎంపిడిఒగా గోపాలకృష్ణ

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు డిప్యూటీ ఎంపిడిఒగా టి.గోపాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడేళ్లుగా నిడదవోలు మండలంలోని తాడిమళ్ల పంచాయతీలో గ్రేడ్ వన్ పంచాయతీ సెక్రటరీగా పని చేశారు. ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపిడిఒగా నియమితులయ్యారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందేలా చూస్తానన్నారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొనుగోళ్లలో కమీషన్ల వేట

- ఈలింగ్ పేరుతో మాయాజాలం
- బస్తాపై అదనంగా 2 నుంచి 5 కేజీల ధాన్యం సేకరణ
- నగదు రూపంలోనూ కమీషన్ల వసూలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పెరవలి మండలంలో కానూరుకు చెందిన కొంతమంది రైతులు నాలుగు రోజుల కిందట ర్యాంపునకు వెళ్లే సిసి రోడ్డులో ధాన్యం ఆరబెట్టారు. స్థానికంగా పురుగుల మందులు విక్రయించే ఒక దళారీ ఆ రైతుల వద్దకు వెళ్లాడు. షెడ్యూల్ తీసుకోవడం నుంచి.. శ్యాంపిల్స్ సేకరణ, ధాన్యం మిల్లుకు పంపించేవరకు అంతా తన బాధ్యతేనని చెప్పాడు. అందుకు బస్తాకు 3 కిలోల చొప్పున మిల్లర్లకు అదనంగా ధాన్యం ఇవ్వాలని.. తన కమీషన్ రూ.200 చొప్పున చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. వారి నుంచి సుమారు 200 బస్తాల ధాన్యం కొనుగోలు చేశాడు.

కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి దళారీ ధాన్యం సేకరించారు. తొలుత ప్రతి 75 కేజీల బస్తాకు రూ.80 చొప్పున తనకు కమిషన్ ఇవ్వాలని ఆర్ఎస్‌కె సరఫరాలో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూసుకుంటానని మాట ఇచ్చారు. అనంతరం నిర్ధేశిత దిగుబడికి అదనంగా వచ్చిన బస్తాకు రూ.1500 చొప్పున మాత్రమే లెక్క గట్టారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా దళారులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారీలు, మిల్లర్ల దందా కొనసాగుతోంది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.75 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటి వరకు 205 ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 1.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. కొనుగోలు కేంద్రాలకు తేమశాతం నిర్ధారించే యంత్రాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదు. కొన్ని కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ధాన్యం విక్రయాలకు సంబంధించి కేంద్రాల్లో రైతులకు షెడ్యూల్ ఇవ్వడంలో ఆలస్యమవుతోంది. కొన్ని చోట్ల టార్గెట్ పూర్తయిందని మరోసారి రావాలని చెబుతున్నారు. శ్యాంపిల్స్ తీసుకువెళ్లేందుకు రావాలని కోరగా.. కొన్ని సార్లు సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేరని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో రైతులు మిల్లర్లు, దళారీలను ఆశ్రయించి ధాన్యం విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు అదనంగా ధాన్యంతోపాటు కమీషన్ల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది మద్దతు ధర ప్రకటించింది. 17 శాతంలోపు తేమ ఉంటే బస్తాకు రూ.1895 మద్దతు ధరగా ప్రకటించింది. కానీ దళారులుతేమశాతం ఎక్కువగా ఉందని, ధాన్యం దిగుబడి(ఈలింగ్) రాదంటూ రూ.1600 లోపే ధర కడుతున్నారు.

మిల్లర్లతో కుమ్మక్కు

పౌర సరఫరాలశాఖ, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొంత మంది సిబ్బంది మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ధాన్యం విక్రయించేందుకు వెళ్లిన రైతులను ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లు పంపించిన రైతుల జాబితాకు మాత్రం వేగంగా షెడ్యూల్ ఇస్తున్నా రని, వారి ధాన్యం శ్యాంపిల్స్ నిర్ధారణ రిపోర్టు ఇచ్చి.. మిల్లులకు ధాన్యాన్ని అటాచ్ చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. కొంతమంది మిల్లర్లు భారీస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ అధికారులు తనిఖీలు చేపడితే నిల్వలు బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

పలు సేవలు అందుబాటులోకి వచ్చినా..

గత అనుభవాల దష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ సేవలను సైతం అందుబాటులోకి తెచ్చింది. రైతులు 7337359375 నెంబరుకు హాయ్ అని మెసేజ్ పెట్టగానే పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. రైతుల వద్ద ఎన్నిబస్తాల ధాన్యం ఉన్నాయి? ఏ రకం? బస్తాలు ఎప్పటికి సిద్ధమవుతాయి? వంటి వివరాలు ఆరా తీస్తారు. ఏ కేంద్రంలో ఏ రోజు? ఏ సమయానికి? ఏ రకం ధాన్యం.. ఎన్ని బస్తాలు విక్రయించాలో తదితర వివరాలతో కూడిన స్లాట్ బుక్ అవుతుంది. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో నగదు రైతుల అకౌంట్లలో జమవుతుంది. రైతుసేవా కేంద్రాలు, మిల్లుల్లో ఒకేలా తేమశాతాన్ని కొలిచే యంత్రాలను ఏర్పాటు చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారులకు ఆదేశించింది. మరోవైపు రైతులకు ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు ఎదురైతే తెలియజెప్పేందుకు 1967 టోల్ ఫ్రీ నెంబర్‌ను సైతం అందుబాటులో తెచ్చింది. కలెక్టరేట్ కంట్రోల్ రూం నంబరు 8309487151 నంబరుకు సైతం సంప్రదించవచ్చు. అయినప్పటికీ జిల్లాలో దళారుల హవా తగ్గేలా కనిపించడం లేదు.

దళారుల బారిన పడొద్దు

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ మద్దతు ధర మేర చెల్లింపులు జరుగుతాయి. రైతులు దళారుల బారిన పడొద్దు. 7337359375 నెంబర్‌కు హాయ్ అని వాట్సాప్ మెసేజ్ పెడితే చాలు పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందిస్తారు. వివరాలు నమోదు చేసుకొని ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 1967 టోల్‌ఫ్రీ నెంబర్, లేదా 8309487151 కంట్రోల్ రూమ్ నెంబర్‌ను సంప్రదించాలి.

- బి.గణేష్‌కుమార్, పౌరసరఫరాల శాఖ, జిల్లా మేనేజర్

బాలోత్సవం వేదిక వద్ద ఏర్పాట్లు

నేటి నుంచి గోదావరి బాలోత్సవం

ఎస్‌కెవిటి కళాశాలలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

చారిత్రక రాజమహేంద్రవరంలో నేటి నుంచి రెండు రోజుల పాటు బాలల ఉత్సవానికి సిద్ధమైంది. నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో గోదావరి బాలోత్సవం నిర్వాహణకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే ఆహ్వాన సంఘం పూర్తి చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు ఈ బాలోత్సవాన్ని పర్యాటక శాఖ మంత్రి, గోదావరి బాలోత్సవం ఛైర్మన్ కందుల దుర్గేష్ ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథిగా పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి, కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా డిఎస్ఇఒ కె.వాసుదేవరావు, గోదావరి బాలోత్సవం అధ్యక్షులు నున్న తిరుమలరావు, విశిష్ట అతిథులుగా అమరావతి బాలోత్సవం కన్వీనర్ పి.మురళీకృష్ణ, సిసిసి ఎమ్‌డి పంతం కొండలరావు, గోదావరి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు సత్తి భాస్కరరెడ్డి(కంద రెడ్డి), షిరిడి సాయి విద్యా సంస్థ డైరెక్టర్ తంబాబతుల శ్రీధర్, అక్షర శ్రీ విద్యానికేతన్ కరస్పాండెంట్ తుమ్మలచెరువు నాగరత్నం, శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ ఛైర్మన్ రావిపాటి మదన వేణుగోపాలస్వామి పాల్గొననున్నారు. ప్రారంభ సభ బాలోత్సవం అసోసియేట్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ వివిఎస్ఎస్.కృష్ణకుమార్ అధ్యక్షతన జరగనుంది. రెండు రోజుల పాటు జరిగే బాలల పండుగలో పాల్గొనేందుకు జిల్లాలోని 145 పాఠశాల నుంచి సుమారు ఎనిమిది వేల మంది విద్యార్థులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తమ ప్రతిభను వివిధ రకాల పోటీల్లో చాటుకోనున్నారని గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి వెల్లడించారు. ఆయా విభాగాలకు వేర్వేరుగా వేదికలను ఏర్పాటు చేశామని తెలిపారు.

జ్యోతీరావు పూలేకు ఘన నివాళి

ప్రజాశక్తి- గోపాలపురం

వెనకబడిన వర్గాల వారి హక్కుల కోసం, మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని హెచ్‌ఎం రాపాక బాబూరావు అన్నారు. శుక్రవారం వేళ్ల చింతల గూడెం మండల పరిషత్ ప్రాథమిక ప్రత్యేక పాఠశాలలో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాబూరావు మాట్లాడుతూ భారత ప్రథమ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి, వెనుకబడిన బడుగు బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యా ఆకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని కొనియాడారు. నేటి యువత పూలేని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దూబచర్ల డైట్ కాలేజీ ట్రైనింగ్ టీచర్ ఎల్.ఝాన్సీరాణి, సిఆర్‌పి కొయ్య నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గోకవరం

ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో భాగంగా 11కెవి మల్లవరం లోకల్ ఫీడర్ పరిధిలో కొత్త లైన్లను వేసేందుకు శనివారం విద్యుత్ సరఫరాను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిలిపేస్తున్నామని ఇఇ జెపిబి.నటరాజన్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట, సూదికొండ, గంగంపాలెం, ఠాకూరుపాలెం, జగన్నాథపురం, మల్లవరం, భూపతిపాలెం, శివరామపట్నం, ఉమ్మెత్త గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిడదవోలు మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ పట్ల హర్షం

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

నిడదవోలు మున్సిపాలిటీని గ్రేడ్-2 మున్సిపాలిటీ నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాల్టీగా అప్ గ్రేడ్ చేయడం పట్ల నిడదవోలు పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రులు కందుల దుర్గేష్, పి.నారాయణకి ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. స్పెషల్ గ్రేడ్ హోదాతో నిడదవోలు పట్టణానికి అధిక నిధులు మంజూరవుతాయన్నారు. మెరుగైన మౌలిక వసతులు, సదుపాయాలు, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు అమలు మరింత వేగంగా జరుగుతాయన్నారు. ఈ హోదాతో తాడేపల్లి గూడెంలో ఆగే అన్ని ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు నిడదవోలులో ఆగుతాయన్నారు. ఎంపీ పురంధేశ్వరి చొరవ తీసుకుంటే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పదో తరగతి పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక అకాడమిక్ ప్రణాళికలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ఈ దిశగా ఉపాధ్యాయులు తరగతి వారీగా విద్యార్థుల అభ్యాస స్థాయిని విశ్లేషించి ఎ, బి గ్రేడ్‌ల్లో ఉన్నవారికి ప్రోత్సాహం, సి, డి గ్రేడ్‌ల్లో ఉన్నవారికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడి తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందుకోసం ఆధార్ ఆధారిత విద్యార్థి వివరాల అప్‌డేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 1,684 పాఠశాలల్లో మొత్తం 3,13,958 మంది విద్యార్థుల్లో ఇప్పటి వరకు 2,86,311 మంది విద్యార్థులకు అప్‌డేషన్ పూర్తయ్యిందన్నారు. పూర్తి శాతాన్ని చేరేందుకు గ్రామ/వార్డు సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ తదితర సిబ్బందిని సమన్వయంతో వినియోగించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం డిసెంబర్ 5న ప్రతి పాఠశాల పరిధిలో మెగా పిటిఎం 3.0 కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధతో, ప్రజాప్రతినిధుల సమక్షంలో, ఎటువంటి డైవర్షన్ లేకుండా విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇందు కోసం పాఠశాల ఆవరణ సుందరీకరణ నుంచి కమిటీలు నిర్వహించాల్సిన బాధ్యతల వరకు స్పష్టమైన కార్యాచరణ జాబితా రూపొందించాలన్నారు. తల్లిదండ్రులతో విద్యార్థుల అభ్యాస స్థాయి, ప్రగతి నివేదికలు, తదితర లక్ష్యాలలో పురోగతి, కెరీర్ కౌన్సెలింగ్ వీడియోలు, టిఎల్ఎంకిట్ల ప్రదర్శనలు వంటి అంశాలను ఒకే వేదికపై సమగ్రంగా తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రుల భాగస్వామ్యం పాఠశాల పురోగతికి కీలకం అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి తరగతి గదుల్లోనే కూర్చునే విధంగా స్పష్టమైన సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఒక్కొక్క తల్లితండ్రులతో వ్యక్తిగతంగా చర్చించి వారి పిల్లల పురోగతిపై ఒక అవగాహనకి రావాలన్నారు. అవసరమైన సహకారం, హెల్త్ కార్డ్ వివరాలు, నిపుణ్ లక్ష్యాలు వంటి అంశాలను తెలియజేయాలన్నారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే 10వ తరగతి ఫలితాల్లో గుణాత్మక మార్పు సాధ్యం అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఎ పీడీ ఎస్.సుభాషిణి, డిప్యూటీ డిఇఒ దిలీప్, డివిజనల్, మండల విద్యా అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు ఎస్.భార్గవి సిబ్బందికి సూచించారు. శుక్రవారం బొమ్మూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. వసతిగృహాల ఆవరణలో శానిటేషన్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ అధికారులను పిలిపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటి విషయంలో ఎంత పరిశుభ్రత పాటిస్తామో, విద్యార్థుల వసతిగృహాల్లో అంతకంటే ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని అధికారులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మిడ్డే మీల్స్‌ను తిన్నారు. ఆహార నాణ్యత, వంటశాల నిర్వహణ, పౌష్టికాహారంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో సమగ్ర చర్చలు జరిపారన్నారు. ముఖ్యమంత్రి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ విద్యార్థుల బాగోగుల కోసం నిరంతరం ఆలోచిస్తూ చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యార్థులు తెలియజేసిన సమస్యలను నెలరోజుల వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వంటశాలపే పరిశీలిస్తున్న భార్గవి

బాలికల భద్రత కోసం వసతిగృహాల్లో మహిళా వాచ్‌వుమెన్లను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ తరగతులు పూర్తయ్యాక కనీసం ఐదు పది నిమిషాలు పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం జోనల్ ట్రైనింగ్ కాలేజీలో హైర్ బస్ డ్రైవర్లు, ఆన్ కాల్ డ్రైవర్లకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి వైఎస్ఎన్.మూర్తి వీటని ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు డిసెంబర్ 31 వరకూ జరుగనున్నాయి. మ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 16 డిపోల నుంచి మొత్తం 1,014 డ్రైవర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. తొలిరోజు 63 మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ,్చారుచ్చినారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు థియరీ క్లాసులు, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ప్రాక్టికల్ క్లాసులు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ సుమారు 60 మందికి శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఆర్‌టిసి, ట్రాఫిక్ పోలీసులు, రవాణా అధికారులు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. శుక్రవారం జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్.మూర్తి, ట్రాఫిక్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎ.శివాజీ, పి.శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంబా ప్రసాద్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - నిడదవోలు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎఐసిసి కార్యదర్శి, జిల్లా అబ్జర్వర్ అంబా ప్రసాద్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిడదవోలు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ మేడవరపు భద్రందొర ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణకుమారి, జిల్లా అధ్యక్షులు టికే విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ అగర్వాల్ హీరాలాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు దారపురెడ్డి సుజాత, షేక్ బషీర్, మహ్మద్ అన్వర్ ఖాన్, కాకి కిషోర్, పుచ్చకాయల వరప్రసాద్, ఎం.శారద పాల్గొన్నారు.

3 వేల మంది విద్యార్థులపై పర్యవేక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

కోడ్‌తంత్ర ప్రోగ్రామ్‌ద్వారా ఒకేసారి 3వేల మంది విద్యార్థులను ప్రొక్టరింగ్(పర్యవేక్షణ) చేశారు. జాస్తి బుల్లమ్మ డిగ్రీకళాశాల విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించి ఈ ఘనత సాధించారు. కౌశల్ జిల్లా స్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు జరిగాయి. విద్యార్థులు వారి మొబైల్స్‌లో వారి స్కూల్లోనే ఈ పరీక్షను రాశారు. ఆన్‌లైన్ ప్రోక్టరింగ్ ద్వారా వారిని పర్యవేక్షణ చేశారు. కౌశల్ స్టేట్ జాయింట్ కో-ఆర్డినేటర్ మేకాసు సత్యరేఖ ఈ ప్రోగ్రామ్‌ను డిజైన్ చేసి జాస్తి బుల్లమ్మ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు ట్రైనింగ్ ఇచ్చారు. పరీక్ష లేదా టెస్ట్ సమయంలో చీటింగ్ నివారించడానికి ఇది ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వెబ్ కేమ్, ఎఐ, స్క్రీన్ మోనిటరింగ్ వంటి సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులను దూరం నుంచి పర్యవేక్షించే ప్రక్రియే ఆన్‌లైన్ ప్రోక్టరింగ్ అన్నారు.

ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో పేరెంట్స్, టీచర్స్ మీట్

రాజమహేంద్రవరం సిటీ : నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి విభాగ అధిపతి డాక్టర్ కోమల లక్ష్మి అధ్యక్షత వహించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉమ్మడి పాత్రపై ప్రధానంగా చర్చించారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి విభాగం అనుసరించే వ్యూహాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయ వనరులు తదితర సౌకర్యాలను తెలిపారు. విద్యార్థులకు సహాయకారిగా సుసంపన్నమైన విద్యా వాతావరణాన్ని అందించడానికి తాము నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు.

కార్టూ'నిజం'



ఒబిసి సర్టిఫికెట్ల మంజూరుకు కృషి

తూర్పుకాపు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ యశస్వి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

తూర్పుకాపులకు ఒబిసి సర్టిఫికెట్లు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర తూర్పు కాపు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పాలవలస యశస్వి హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా తొలిసారి ఆమె శుక్రవారం నగరానికి వచ్చారు. నగర తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రౌతు తాతాలు కల్యాణ మండపంలో నగర తూర్పుకాపు విద్య విజ్ఞాన అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి మజ్జి రాంబాబు అధ్యక్షత సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎంఎల్‌ఎ రౌతు సూర్య ప్రకాశరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రామరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రౌతు, మజ్జి రాంబాబు మాట్లాడుతూ తూర్పుకాపు విద్యార్థులకు ఏడెనిమిదేళ్లుగా ఒబిసి సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫలితంగా వారు రాయితీలకు దూరమయ్యారు. ఉద్యోగాలు పొందలేకపోతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై యశస్వి స్పందించారు. జిల్లాలో తూర్పుకాపు విద్యార్థులను చిన్నచూపు చూస్తున్న సంఘటనలు తనకు బాధ కలిగిస్తున్నాయన్నారు. వారికి ఎదురవుతున్న ఇబ్బందులు తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ పాలవలస యశస్విని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లంక సత్యనారాయణ, వై.మరిడియ్య, ఆర్.వెంకట్రావు, బి.త్రిమూర్తులు, వై.శ్రీనివాసరావు, కె.కృష్ణారావు, పి.పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

యశస్విని సత్కరిస్తున్న నాయకులు

యాత్రికుల కోసం విశ్రాంతి సముదాయం

ప్రజాశక్తి- నల్లజర్ల

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని కాలినడకన దర్శించుకునే యాత్రికుల కోసం త్రీ ఎఫ్ ఆయిల్ ఫామ్ యాజమాన్యం విశ్రాంతి సముదాయాన్ని ఫ్యాక్టరీ సమీపంలో నిర్మించింది. అంతేకాకుండా యాత్రికులకు తాగునీరు, మజ్జిగ, పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని కంపెనీ సిఇఒ ఆశిష్ గోయంక శుక్రవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో యాత్రికులకు మరిన్ని సేవా కార్యక్రమాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వెంకటరామయ్య, రామకృష్ణ, కిలారు శ్రీనివాసరావు, విజయ ప్రసాద్, నరేంద్ర రెడ్డి, వడ్లమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు నిధులు ఇవ్వాలని వినతి

కొవ్వూరు : పట్టణంలో యానాద కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిమిత్తం రూ.40 లక్షల నిధులు మంజూరు చేయాలని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఎంపీ పురందరేశ్వరుని కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో ఎంపీని కలిసి ప్రతిపాదనలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎంపీ లార్డ్స్ నిధులనుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరామన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితులతో పోలీసులు

131 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - నల్లజర్ల

బొలెరో వ్యాన్‌లో తరలిస్తున్న రూ. 65,73,500 విలువ చేసే 131.47 కేజీల గంజాయిని నల్లజర్ల పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంజాయి రవాణాపై నల్లజర్ల ఎస్ఐకు ముందస్తు సమాచారం వచ్చింది. ఈ మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. తాడేపల్లిగూడెం నుంచి నల్లజర్ల గ్రామం వైపు వస్తున్న బొలెరో వ్యాన్‌లో ఆరు ప్లాస్టిక్ సంచులను గుర్తించారు. తనిఖీ చేయగా ఇందులో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం మంగాలపల్లి పంచాయతీ పరిధిలోని మారేటిపల్లికి చెందిన డ్రైవర్ తలారి ఆనంద్, మరో వ్యక్తి పూల మనోహర్‌ను అరెస్టు చేశారు. వారిని విచారణ చేయగా కేడి పేట అవతల ఉన్న కాకరపాడు ఏజెన్సీ ఏరియా నుంచి తీసుకొస్తున్నట్ట తెలిపారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు పూల మనోహర్‌పై గతంలో ఐదు గంజాయి అక్రమ రవాణాకి సంబంధించిన కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకోవడంలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్, నల్లజర్ల సిఐ వై.రాంబాబు, ఎస్ఐ కె.దుర్గాప్రసాద్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

తగాదాలో వ్యక్తి ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

రెండు కుటుంబాల మధ్య ఘర్షణలో ఒక వ్యక్తి హఠాత్తుగా కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం తాటిపర్తిలో చోటు చేసుకుంది. బంగారుపేటలో శ్రీమంతుడు కుమార్తె పుట్టినరోజు ఏర్పాట్లకు ఇంటి పక్కన రహదారి మీద పొయ్యి పెట్టి ఎవరో ఆ మార్గం గుండా వెళ్ళకుండా అడ్డుగా బల్లపెట్టారు. ఆ ఇంటి వెనుక వైపు నివాసం ఉంటున్న వేంపాల సూరిబాబు (55) కుటుంబ సభ్యులు దీనిపై తగాదా పడ్డారు. అకస్మాత్తుగా సూరిబాబు కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు. ఆయనకు ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

వాటర్ ప్లాంట్‌లో మోటార్ల చోరీ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌లో నేచురల్ ఆయిల్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన మోటార్లు చోరీకి గురయ్యాయి. దీంతో గ్రామంలో వాటర్‌కు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని, దీనిపై పంచాయితీ కార్యదర్శి గంగాధర్ చోరీకి పాల్పడిన వారిని గుర్తించి శరీర తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ శివారులోని బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గొల్లప్రోలు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని పోలీసులు అదుపులో తీసుకుని వారి వద్ద రూ.4,020 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

యువతి అదృశ్యంపై శుక్రవారం సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలో పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన యువతి తల్లి ఉప్పలపాటి అరుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. ఆమె కుమార్తె డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుందన్నారు. ఏటుగట్టు రహదారి నిర్మాణం కారణంగా బస్సులు నడవక పోవడంతో రఘుదేవపురంలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటుందన్నారు. అక్కడి నుంచే కళాశాలకు వెళ్తుందన్నారు. ఈ నెల 26న రఘుదేవపురంలో అమ్మమ్మ ఇంటి నుంచి రాజమహేంద్రవరంలో కళాశాలకు వెళ్లిందన్నారు. తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితులను వాకబు చేయగా ఏటువంటి ఆచూకీ లభించలేదన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి - కరప

అదృశ్యమైన కరప బిసి గురుకుల పాఠశాల విద్యార్థి పుల్లేటిగుర్తి చరణ్‌తేజ(11) ఆచూకీని పోలీసులు గుర్తించారు. విశాఖ జిల్లా పెదవాల్తేరుకు చెందిన చరణ్‌తేజ కరప బిసి గురుకుల హాస్టల్లో 6వ తరగతి చదువుతున్నాడు. అతని తల్లితండ్రులు ఈ నెల 27న మధ్యాహ్నం 12.30కి హాస్టల్లో అప్పగించి వెళ్లి పోయారు. అదేరోజు రాత్రి 7గంటల నుంచి బాలుడు అదృశ్యమయ్యాడని ప్రిన్సిపల్ రామకృష్ణ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ టి సునీత కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా చరణ్ తేజ విశాఖలోని తన పెద్దమ్మ ఇంటి వద్ద ఉన్నట్లు తన తల్లికి ఫోన్ చేసి తెలిపాడు. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లి ప్రిన్సిపల్‌కు, పోలీసులకు తెలియపరిచారు. తన పెద్దమ్మతో ఉన్న ఫోటోను వాట్సప్ ద్వారా పంపించారు. ఈ నేపథ్యంలో హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు.

దుద్దుకూరులో వాలీబాల్ సెలక్షన్స్

ప్రజాశక్తి-దేవరపల్లి

దుద్దుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, సీనియర్ వాలీబాల్ జట్లకు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ప్రారంభించారు. డిసెంబర్ రెండో వారంలో జూనియర్ల టోర్నమెంట్ జరగనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ గారపాటి రాఘవేంద్ర తెలిపారు. ఎంపికలకు హాజరైన క్రీడాకారులకు కృష్ణబాబు భోజన సదుపాయం కల్పించారు.

టెట్ నుంచి మినహాయించాలని ఎంపీకి వినతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇరవై సంవత్సరాలు పైబడి సర్వీస్ చేసిన సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ నాయకులు శుక్రవారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి వినతి పత్రం అందించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ స్థానిక పలుకు కేంద్రం వద్ద ఎంపీని కలిసి పరిస్థితి వివరించారు. విద్య హక్కు చట్టం 23(2) ప్రకారం ఇటీవల సుప్రీంకోర్టు ఉపాధ్యాయులంతా విధిగా టెట్ పాస్ అవ్వాలని తీర్పునిచ్చిందన్నారు. అయితే 2011 నుంచి టెట్ అమల్లోకి వచ్చిందన్నారు. చాలామంది ఉపాధ్యాయులు ఇప్పటికే 20 నుంచి 30 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేశారని, వారికి ఇప్పుడు టెట్ రాయాలనే నిబంధన పెడితే చాలా ఇబ్బంది పడతారన్నారు. దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలని, అలాగే పార్లమెంటు, ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాలని ఎంపీకి విన్నవించారు. విద్యాహక్కు చట్టంలోని 23(2) సవరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ టి ఎఫ్ ఐ) కూడా జాతీయస్థాయిలో ఈ విషయంపై దేశంలోని ఎంపీలను, రాజ్యసభ సభ్యులను కలిసి విజ్ఞాపన చేస్తుందన్నారు. ఎంపీ పురందేశ్వరి స్పందిస్తూ ఈ విషయంపై చర్చించి పార్టీ నిర్ణయం మేరకు తగ్గింది చర్య తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ కోశాధికారి ఇవిఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు, నాయకులు గండి స్వామి ప్రసాద్, గోపాలకృష్ణ, పెంకే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లు, నిర్మాణాలకు నోటీసులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రాహుల్ మీనా

నగరంలో అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన భవనాలు, అనధికారికంగా వేసిన లేఅవుట్లకు వారం రోజుల్లోగా నోటీసులు జారీ చేయాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిసిఆర్ఎస్ హాల్లో ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం - 2025, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం -2020పై సుధీర్ఘంగా చర్చించారు. ప్లానింగ్ సెక్రటరీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లను గుర్తించి నోటీసులు ఇవ్వాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ మరియు బిపిఎస్‌లపై భవన యజమానులకు అవగాహన కల్పిస్తూ, క్రమబద్ధీకరించుకునేలా చూడాలన్నారు. ఇటీవల విడుదల చేసిన జిఒ 225 ద్వారా 1985 జనవరి 1 నుంచి 2025 ఆగష్టు 31 మధ్యకాలంలో నిర్మించిన అనధికార భవనాలను బిపిఎస్ ద్వారా క్రమబద్ధీకరిస్తామన్నారు. గడువు అనంతరం క్రమబద్ధీకరించుకోని భవనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా డిమాలిషన్ చేయడం జరుగుతుందని తేల్చి చెప్పారు. ఆయా కట్టడాలకు సంబంధించిన బిల్డర్లు, డెవలపర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతామన్నారు. బహుళ అంతస్తుల భవనాలలో నిర్వహించే ఆస్పత్రులు, ఇతర కమర్షియల్ భవనాలకు పార్కింగ్ ప్రదేశం తప్పనిసరిగా విడిచి పెట్టాలని రాహుల్ మీనా పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వాటికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అంబులెన్స్‌లు, పేషంట్ల తాలుకా వాహనాలను సెల్లార్ లోనే పార్కింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. అలా కాదని రహదారుల వెంబడి పార్కింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. సెల్లార్ ప్రదేశాన్ని కేవలం వాహనాల పార్కింగ్ కే వినియోగించాలి తప్ప ఆస్పత్రి లావాదేవీలకు వినియోగిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్లు నాయుడు, పి.శ్రీనివాస్, ఏసీపీలు, ఇతర టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం ఎంఎల్‌ఎకు వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి-గోకవరం

ఎంఎల్ఎ నెహ్రూకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి, వైసిపి నాయకులు

గోకవరం పంచాయతీ పరిధిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వైసిపి నాయకులు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు వినతి పత్రం అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షతన వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి దాసరి చినబాబు, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సుంకర వీరబాబు పార్టీ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో అర్హులైన 1,600 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయన్నారు. వీరిలో 680 మందికి తంటికొండకు వెళ్లే మార్గంలో పట్టాలు మంజూరు చేశారన్నారు. మిగిలిన వారికి ఇప్పటి వరకు స్థలాలు మంజూరు చేయలేదన్నారు. దీనిపై స్పందించి అర్హులను గుర్తించి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. గోకవరంలోని ఠాణా సెంటర్లో బ్రిటీషు కాలం నాటి ఇరకు వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశాయన్నారు. కొన్ని అనివార్య కారణాలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభంకాలేదన్నారు. దీని వల్ల ప్రతి నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామంలో గ్రంథాలయానికి భవనం మంజూరు చేయాలని విజప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కుమారదేవంలో నిర్వహించిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ వంటి పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. గ్రామానికి చెందిన షేక్ సత్తార్ భీకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.30,786 విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు పిఎం కిసాన్ లబ్ధి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎఎంసి చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్‌చౌదరి, ఆరికరేవుల పిఎసిఎస్ అధ్యక్షుడు చావా శ్రీనివాస్, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఎడి సిహెచ్.శ్రీనివాసరావు, ఎఒ ఎ.గంగాధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - కొవ్వూరు



వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు

నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన గ్రీవెన్స్ డే నిర్వహించారు. 12 అర్జీలు అందినట్లు తెలిపారు. పింఛన్లు ఇవ్వాలని, ట్రై మోటార్ సైకిల్ ఇప్పించాలని, రెవిన్యూ పరమైన సమస్యలపై వినతి పత్రాలు అందినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిజిహెచ్ అన్న క్యాంటీన్‌లో కమిషనర్ రాహుల్‌మీనా శుక్రవారం తనిఖీలు చేపట్టారు. క్యాంటీన్ పరిసరాల్లో స్వచ్ఛత, వడ్డించే ప్రాంతం, చేతులు కడుగు ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అల్పాహారం తీసుకుంటున్న వారితో మాట్లాడారు. తాగునీరు, ఆహార పదార్థాల నాణ్యత, మౌలిక వసతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అభిప్రాయాలను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా తెలియజేయొచ్చని తెలిపారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, సమయపాలన కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. పేదలకు అందించే భోజనం ఎప్పుడూ నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. మెనూను కచ్చితంగా పాటించాలన్నారు. ఆర్ఒ వాటర్ ఫిల్టర్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పాత్రలు, ప్లేట్లను వేడి నీళ్లలోనే కడగాలని సూచించారు.

జనరిక్ మందులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గోకవరం

జనరిక్ షాపును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

ప్రతి ఒక్కరూ మేలు రకమైన జనరిక్ మందులను వినియోగించుకోవాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గోకవరంలోని కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ జనరిక్ మందుల షాపులో మందులు చౌకగా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.అప్పలరాజు, సూరంపాలెం చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ చైర్మన్ గాజిగం సత్తిబాబు, మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, పోసిన ప్రసాద్, సొసైటీ సెక్రటరీ దాసరి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఫంక్షన్ హాల్ నిర్మాణం

ప్రజాశక్తి- గోపాలపురం

ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు

దాతల సహకారంలో ఫంక్షన్ హాల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, వారిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో మరిన్ని ఫంక్షన్ హాళ్లను నిర్మిస్తామని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాపురం గ్రామంలో 2018- 19 అప్పటి ఎంపీ మురళీమోహన్ విడుదల చేసిన రూ.20లక్షల నిధులతో ఈ పనులు చేపట్టారు. నిధులు చాలక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అదే గ్రామానికి చెందిన గ్రామ పెద్ద పిన్నమనేని దత్తాత్రేయుడు రూ.15 లక్షలు విరాళంతో దీన్ని పూర్తి చేశారు. దీన్ని ఎంఎల్ఎ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని పేద, మధ్య తరగతి వర్గాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దత్తాత్రేయుడును ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

గ్రామ పెద్దలు టిడిపి సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం గ్రామ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఫంక్షన్ హాల్లో భోజనాలు ఏర్పాటుకు మరో అంతస్తు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే పెద్దాపురం గ్రామం నుంచి భీమోలు వరకు సుమారు 5.5 కిలోమీటర్లు మేరరోడ్డు అధ్వానంగా ఉందన్నారు. అటుగా ఉన్న పొలాలకు రైతులు, కూలీలు వెళేలందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. భీమోలు గ్రామానికి వెళ్లాలంటే ఈ రహదారి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇది సరిగే లేక చుట్టూ తిరిగి వెళ్లాలంటే సుమారు 13 నుంచి 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. 2018-19లో టిడిపి ప్రభుత్వం రూ.2.5 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిందన్నారు. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలని తెలిపారు. పెద్దాపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా మార్పు చేయాలన్నారు. ప్రస్తుతం ఈ గ్రామం వేలచింతలగూడెం పంచాయతీలో ఉందని తెలిపారు. దీంతో గ్రామస్తులు సచివాలయాలకు వెళ్లాలంటే 2 కిలోమీటర్ల పైగా వెళ్లాల్సి వస్తుందన్నారు. గ్రామంలో రెండు వేలకు పైగా ప్రజలు ఉన్నారని 1500 పైగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. దీనిపై ఎంఎల్ఎ స్పందించారు. పెద్దాపురం నుంచి భీమోలు వరకు రెండు విడతల్లో రోడ్డును పూర్తి చేస్తామని తెలిపారు. మిగిలి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు, టిడిపి మండల అధ్యక్షులు కొర్లపాటి రాము, సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం, గన్నిన మురళి, ఇల్లూరి రాంబాబు, కొడవటి సూరిబాబు, చల్లమల్ల సుబ్బారావు, పిల్లి రంగారావు, కాకర్ల రామతులసి, పంచాయతీ కార్యదర్శి వై.అలేఖ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ యలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 331 / 2023

బిట్వీన్:
మలపరెడ్డి శ్రీనివాసులు . . . వాది
అండ్:
లమ్మత ఫాల్గుణరావు . . . ప్రతివాది
టు:
ప్రతివాది:
లమ్మత ఫాల్గుణరావు, తండ్రి ధర్మారావు సాకేను డో.నెం. 104-3-294, 2వ వీధి, గణేష్ గుడి ఎదురుగా, గణేషనగర్, శ్రీచైతన్య స్కూల్ వద్ద, మోరంపాడు రాజమండ్రి-533107.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2025వ సం॥ 12వ నెల 18వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలు గారి ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందువలన మీకు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆరోజున హాజరు పరచుటకు మీకు ఉత్తరువు చేయడమైనది. పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్ష మందు పై వాజ్యమును విమర్శన చేసి తీర్మానించుటమగునని, మీరు తెలుసుకోవలసినది.

(శ్రీకోర్టు వారి ఉత్తరువుతో)

వాడపల్లి అన్నపూర్ణయ్య
అడ్వకేట్, యలమంచిలి
అనకాపల్లి జిల్లా.
సెల్: 9247159149

యలమంచిలి
తే:28-11-2025

యుటిఎఫ్ పెరవలి మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పెరవలి

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురువారం నిర్వహించిన సమావేశంలో 2025-26 విద్యా సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్ల కార్యదర్శి కె.రమేష్‌బాబు, పరిశీలకులుగా జిల్లాకార్యదర్శి వివి.రమణ వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా పి.నరేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శిగా డివిఎస్ఆర్.తారకృష్ణ, కోశాధికారిగా కె.మహేశ్వరరావు, సహాధ్యక్షులుగా ఈ.గణపతి, వి.రాధిక, ఆడిట్ కన్వీనర్‌గా ఎన్‌విఎస్.విశ్వేశ్వరరావు, కార్యదర్శులుగా ఎ.విజయ, పి.విజయ్‌కుమార్, పి.రామాంజనేయులు కె.రామారావు, ఎ.బాలాజీ, వి.శ్రీనివాస రెడ్డి, ఎస్‌కె.సురా సాహెబ్ గెల్లా రాజు ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కౌన్సిలర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని పరిశీలకులు, ఎన్నికల అధికారి సూచించారు.

బహుమతులు ప్రదానోత్సవ సభలో పాల్గొన్న ఎంఎల్ఎ గోపిమూర్తి

విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలోని నిర్వహించిన బాల సభ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సి బోరా గోపిమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రఘుదేవపురం పిఎసిఎస్ సిఇఒ, చైర్మన్ గడ్డం ప్రసాద్, కవల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. విజేతలను ఈ సందర్భంగా గోపి మూర్తి అభినందించారు.

యువతే దేశానికి పునాది

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

యువతే దేశానికి పునాది అన్ని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. కళాశాలలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెమినార్ హాల్లో యువ నాయకత్వంపై విద్యార్థులకు రెండు రోజుల వర్కుషాపు జరిగింది. రెండో రోజైన శుక్రవారం విజయవాడ వివేకానంద కేంద్రానికి చెందిన లింగమనేని రాజేష్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఆత్మవిశ్వాసం, నిస్వార్థ సాధన, భారతీయ సంప్రదాయాలపై మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడారు. విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిర్మాణాత్మక, జాతీయవాద నిర్మాణ కార్యకలాపాల దిశగా మళ్లించాలన్నారు. తత్వశాస్త్ర విభాగం ఇన్‌ఛార్జి డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌ల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల్లో నాయకత్వ విలువలు, నైతిక బాధ్యత, మానవీయ ఆలోచనలను పెంపొందించడానికి తత్వశాస్త్ర విభాగం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం సూర్యనారాయణ, ముప్పిడి మహేష్, సయ్యద్ ఫర్హా యస్రూన్, డాక్టర్ భూషణం, కె.ఈశ్వర్, రాణి, వివేకానంద కేంద్ర సభ్యులు డాక్టర్ కె.రమణ శ్రీనివాస్, వెంకటకష్ణ, రవి, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

వజ్రోత్సవాల సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పురపాలక సంఘ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్య కళాకారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. గణేష్ చౌక్ నుంచి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్, బాలాజీ నగర్, సంజీవయ్య నగర్, చింత చెట్టు వీధి మీదుగా గణేష్ చౌక్ వరకు ర్యాలీ సాగింది. వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు, కో-అప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు ఈ ర్యాలీలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమములో వైస్ చైర్ పర్సన్ షేక్ వజీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, పువ్వల రతిదేవి, ఉసురుమర్తి జాన్ బాబు, కారింకి నాగేశ్వరరావు, మద్దిపాటి ఫణీంద్ర, ఎమ్‌డి.ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఎస్.ఓ.పి.నెం.12/2025

పార్టీలు:-
1. కొత్తపల్లి సావిత్రి
2. కొత్తపల్లి లక్ష్మి
3: బుద్దాల ఉషారాణి ...పిటీషనర్లు
మరియు
1. మెసర్స్ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, (పూర్వం కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్), రిప్రజెంటెడ్ బై మేనేజర్, కోరమాండల్ హౌస్, డోరునెం.1-2-10, సర్దార్ పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం.
2. గుండా గజ లక్ష్మి, (భర్త) అప్పారావు, హిందువు, వయస్సు63సం॥లు, గృహిణి, ఫ్లాటు నెం.107, సాగర్ రెసిడెన్సీ, ఎ.పి.హెచ్.బి, కోలనీ, మౌలాలి, కుషాయిగుడా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం,
3. కొత్తపల్లి సత్యనారాయణ, (తండ్రి) (లేటు) గెరటయ్య, హిందువు, వయస్సు61సం॥లు, రిటైర్డ్ ఉద్యోగి, ఫ్లాటు నెం.101, వనస్పతి బ్లాకు, చెంద్రిక విలాస్ అపార్టుమెంటు, శ్రీరామపురం గ్రామం, రాజానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా.
4. కొత్తపల్లి వెంకట రమణ, (తండ్రి) (లేటు) గెరటయ్య, హిందువు, వయస్సు57సం॥లు, ఉద్యోగి, డోరు నెం.2-42/301, దొర అపార్టుమెంటు, ప్రకాశం వీధి, అల్కాట్ గార్డెన్స్, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరిజిల్లా ...రెస్పాండెంట్లు

పై పిటీషనర్లు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పై గ్రంథంలో చనిపోయిన కొత్తపల్లి గెరటయ్య గారి తాలూకు షేర్ సర్టిఫికెట్లుకు పై పిటీషనర్లు వారసులు అని సక్సేషన్ సర్టిఫికెట్ మంజూరు నిమిత్తం దాఖలు చేసిన పై పిటీషను **ది.29-12-2025వ** తేదీ కు పై కోర్టులో వాయిదా అయి వున్నది. కావున పై నెంబరు పిటీషనులో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల పై కోర్టు ఎదుట **ది.29-12-2025వ** తేదీ ఉదయం **గం॥10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తమ అభ్యంత రములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై పిటీషను పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి(రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్
డోర్.నెం. 86-11-11/1
రాజమండ్రి వాడ్రేవునగర్,తిలక్‌రోడ్
ది. 27-11-2025 రాజమండ్రి

ప్రకటన

In the Court of the Hon'ble Principal Civil Judge (Senior Division) at Rajamahendravaram
S.O.P.No. 10/2025

Between:
Iduru Gayathri Devi - Petitioner
and
Bula Venkata Ramana - Respondent

పైన తెలిపిన పిటీషనర్, (లేటు) హైమావతి గారి చెల్లెలు మరియు రెస్పాండెంట్ (లేటు) హైమావతి గారికి భర్త (లేటు) హైమావతి గారు డైట్ కాలేజ్, బొమ్మూరు రాజమండ్రి నందు పనిచేసేవారు ఆమె అప్పుడు 40,000 వేలు రూపాయలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దవళేశ్వరం బ్రాంచ్, రాజమండ్రి నందు డిపాజిట్ చేసియున్నారు మరియు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ నందు లక్ష రూపాయలు (రూ. 1,00,000) పాలసీ తీసుకొనియున్నారు. (లేటు) హైమావతి గారు తన భర్తను (రెస్పాండెంట్) అక్టోబర్ 2016 సంవత్సరము వదిలిపెట్టి వెళ్ళిపోయినారు. ఈ విషయం పై కడియం పోలీస్ స్టేషన్, రాజమండ్రి రూరల్ నందు ఉమెన్ మిస్సింగ్ కేస్ నమోదు చేసినారు. సదరు పోలీస్ వారు ది. 11-07-2024 నందు final report file చేస్తు సదరు హైమావతి గారు చట్టప్రకారం చనిపోయినట్లుగా నిర్ధారించారు. రెవెన్యూ శాఖ ది. 28-08-2024 హైమావతి చనిపోయినట్లు Death Certificate మంజూరు చేసినారు. ఆ తరువాత హైమావతి గారి భర్త (రెస్పాండెంట్) వెంకట రమణ గారు పిటీషనర్ గారి కుటుంబముతో సంబంధము లేకుండా జీవించుచున్నారు. మరియు (లేటు) హైమావతి వారి భర్త (రెస్పాండెంట్) వెంకటరమణ గారికి వారి వైవాహిక జీవితంలో పిల్లలు కలుగలేదు. ది. 11-06-2024 బుల్లా వెంకట రమణ (రెస్పాండెంట్) అయిన తన భార్య (లేటు) హైమావతి గారికి సంబంధించిన స్థిర, చరాస్తులు మరియు ఇన్సూరెన్స్ క్లెయిమ్స్, బ్యాంక్ డిపాజిట్స్ తన హక్కులు వదులుకొని ఒక బాండ్ రూపంలో వ్రాయించి నోటరీ చేసి పిటీషనర్‌కి అందించారు. కావున ఇట్టి స్థితిలో పైన తెలిపినటువంటి బ్యాంక్ డిపాజిట్ (40,000) మరియు పోస్టల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ (1,00,000) వెరశి (1,40,000) ఒక లక్ష నలభైవేలు రాబట్టుకొనుటకు ది. 23-10-2025న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, రాజమండ్రి యందు ఎస్.ఓ.పి.నెం: 10/2025 పిటీషనర్ దావా దాఖలు చేసియున్నారు. (లేటు) హైమావతి గారి వారసురాలుగా పిటీషనర్ గాయత్రి గారు, రెస్పాండెంట్ బి. వెంకట రమణ పైన పై దావా Succession Certificate నిమిత్తము ఎస్.ఓ.పి.నెం: 10/2025 దాఖలు చేయగా కోర్ట్ వారు ది. 09-12-2025కి వాయిదా వేసియున్నారు. సదరు పిటీషన్‌పై ఎవరికైనను అభ్యంతరములు ఉన్న యెడల సదరు పై కోర్ట్‌లో తెలుపు కొనగలరు. లేని యెడలపై పిటీషన్ కోర్ట్ వారు విచారించిపై పిటీషనర్‌ని వారసురాలిగా ప్రకటించగలరని తెలియజేయు చున్నాము.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
ఇట్లు
దివి వరప్రసాద్, అడ్వకేట్
డో.నెం. 21-16-17, పప్పులమిల్లు ఎదురుగా, మధురానగర్, విజయవాడ-11.
సెల్: 9866204872
వాయిదా తేది: 09-12-2025